
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future



# అపురూపమైన రోజు

కేశిరాజు ఫణిప్రసాద్

ఆదివారం ఉదయం పది గంటలు! ఎన్నాళ్ల నుంచో నన్ను రమ్మని, మాట్లాడాలని విశాల మా ఆవిడ వసుధతో కబురు చేస్తుంటే వీలుచేసుకుని ఇవ్వాళ వెళ్లాను!

"అన్నయ్యగారు ఎలాగైనాసరే మీరు నాకు ఈ ఉపకారం చేసిపెట్టండి" ఆవిడ అభ్యర్థన నా మనసును కదిలిస్తోంది! కాని నా మనసు మాత్రం ఒప్పుకోవడం లేదు! అలాగని ఆవిడ మాట కాదనటం కూడా నా వల్ల కావటం లేదు.

కాస్సేపు మాట్లాడటం ఆపి ఆలోచనలో పడ్డాను! అలా ఆలోచిస్తేనే ఒక్కసారి గోడకున్న ఫొటో దగ్గర నా చూపులు నిలబడిపోయాయి. ఆ ఫొటోలో వున్నది నా ఆప్తమిత్రుడు పరంధామ! విశాల భర్త!

"ఒరేయ్ మాధవ్ నేను వున్నన్నాళ్లు ఈ కుటుంబం కళ కళలాడుతూ వుందని నీకూ తెలుసు! నేను పోయాక ఇంట్లోనూ, ఇక్కడే పెరిగి పెద్దవాళ్లయిన నా కొడుకులూ, కూతురు వల్ల ఎటువంటి మార్పు వచ్చిందో కాస్త ఆలోచించు!

ఆస్తి పంపకాలు పూర్తికాగానే ఎవరి మట్టుకు వాళ్లు

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

వెళ్లిపోయారు! ఇక మిగిలింది నా భార్య విశాల! నన్ను నా జ్ఞాపకాలను తోడుగా చేసుకుని ఇక్కడే వుండిపోయిన అమాయకురాలు! ఆ పిచ్చితల్లి మనసు అర్థం చేసుకో''

చనిపోయిన నా స్నేహితుడు నాకెదురుగా నిలబడి మాట్లాడినట్లుగా అనిపించింది! మనసు విచలితమైపోతోంది!

మరుక్షణం విశాలవైపు చూశాను! ఆవిడ నన్నే చూస్తోంది! ఎక్కడెక్కడో వున్న తన పిల్లలని తన దగ్గరకొచ్చేటట్టుగా చెయ్యమని పదేపదే నన్ను అడుగుతోంది! ''వచ్చే నెలలో నా పిల్లలందరూ నన్ను చూడటానికి రావాలి! వాళ్లందరూ వచ్చాక, ఆ సందడితో నా ఇల్లు కళకళలాడాలి'' అలా అడగటంలో ఆత్మీయత, అనురాగం ఇంకా ఎన్నో నిండి వున్నాయి!

పిల్లల్ని చూడాలన్న కోరిక ఆ వృద్ధురాలి గాజుకళ్లల్లో ప్రతిబింబిస్తోంది! ఈ తల్లి మనసుని వాళ్లు అర్థం చేసుకుంటారా? తల్లి వుందన్న విషయం కనీసం ఉత్తరం ద్వారానైనా తెలుసుకోవాలనిపించని వాళ్లు ఇప్పుడు ఉత్తరం రాస్తే వస్తారా? అదీ నేను రాస్తే?'' అన్నయ్యగారు నా మాటగా మీరు ఉత్తరంలో రాయండి, మీరు రాస్తే తప్పకుండా వస్తారు'' మళ్లీ ఇదేమాట మాట్లాడింది విశాల!

''ఇలా నేను కంటికి చూపు దూరం కాకుండా, నా పిల్లల్ని నేను గుర్తుపట్టే స్థితిలో వున్నప్పుడు వాళ్లు నాకు కనపడితే.... అంతే చాలు''

ఒక తల్లిప్రేమ చుక్కచుక్కగా కళ్లలోంచి రాలుతోంది! అటువంటి స్థితిలో చూస్తుంటే నన్ను నేను నిగ్రహించుకోలేకపోతున్నాను!

ఈ క్షణంలో నా భార్యకూడా వుండివుంటే విశాలమాటల తీరుకి తప్పకుండా బావురుమనేది!

ఒక్క క్షణం! ఇంటికి వెళ్లి మా ఆవిడ వసుధతో కూడా మాట్లాడితే? నాలో ఆలోచన! ఆ ఆలోచనలలో ఏదో విధంగా విశాల కోరికతీరే మార్గం వసుధవల్ల దొరుకుతుందనే ఆశ!

ఇదే మాట విశాలతో చెప్పాను!, ఆవిడలో ఎంతో ఉత్సాహం! మాటల్లో చెప్పలేని సంబరం! ఇంటికి బయలుదేరాను!

కష్టంలో వున్న వాళ్లకి ఓదార్పునివ్వటంలో తృప్తి వుంది! మనసు ప్రేరేపిస్తోంది!

''ఒక్కొక్కసారి ఆలోచనలు చినుకుల్లా పడుతుంటాయి! ఆ చినుకులతో తడిసిన మనసు మమకారంతో చిగురిస్తుంది!

ఇప్పుడు విశాల మనసులో మమకారం క్షణక్షణానికీ తన పిల్లలని చూడాలని తహతహలాడిపోతోంది''

వసుధ మాటలు వింటూ ఆశ్చర్యంగా చూశాను అయినా నాలోని ఉద్దేశాన్ని చెప్పకుండా వుండలేకపోయాను!

''ఆవిడ పిల్లలు మా జీవితం మాదంటూ వెళ్లిపోయి చాలాకాలమైపోయింది! చూడటానికి రావటం లేదు! అలాగని తరచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేవు! ఇటువంటి పరిస్థితుల్లో ఈవిడకి ఇలాంటి ఆరాటం ఎందుకు కలిగింది?''సమాధానం కోసం ఎదురుచూస్తున్నాను.

వసుధ మాట్లాడలేదు కానీ మనసు ఆలోచిస్తోంది.

''వయసొచ్చిన పిల్లలు తల్లిదండ్రులకి దూరమైపోయి వారికున్న వ్యాపకాలతో ఏదో విధంగా బ్రతుకుతుంటారు! అది వాళ్ల వయసు ప్రభావం! వయసుమళ్లిన తల్లిదండ్రులు తమ పిల్లల జ్ఞాపకాలతో కాలం వెళ్లబుచ్చుకుంటుంటారు! ఇది వార్ధక్యంలో ఎదురయ్యే అనుభవం!

''నాకు తెలిసి ప్రస్తుతం మానసికంగా అనుక్షణం ఇటువంటి స్థితిలోనే బతుకుతోంది! ఈ జ్ఞాపకాలే మనసుని ఆక్రమించుకున్నాయి. తనలోని జ్ఞాపకాలనే మాటల్లో మీతో వివరంగా మాట్లాడింది!'' విశాలకి ఎలాగైనా సహాయం చెయ్యమని సూచిస్తూ చెప్పింది వసుధ.

''అటువంటప్పుడు స్వయంగా తనే ఉత్తరం రాసి పిల్లలను రమ్మని పిలిపించవచ్చుకదా.... నా మాటలని మధ్యలోనే అడ్డుకుంది.

''చూడండి, ఈ తరం వాళ్లకి అర్థం చేసుకోవటం చేతకాదు. అంతేకాదు ఇన్నాళ్లూ రమ్మని ఉత్తరం రాయలేదు. ఎవరెవరు ఎలా వున్నారోనని క్షేమసమాచారాలు కూడా కనుక్కోలేదు. అటువంటి ఆవిడకు ఏదో అవసరం వచ్చి మమ్మల్నిరమ్మంటోంది'' అనుకుని ఎవరికి తోచినట్టు వాళ్లు అపార్థం చేసుకుంటారు''

''ఇటువంటి ఆలోచన నాకెందుకు రాలేదు?'' నన్ను నేను ప్రశ్నించుకునే క్షణం అంతేకాదు, నాకూ చిన్నతనంగా కూడా అనిపించింది''

''నువ్వెంతో ఆలోచించి అర్థవంతంగా మాట్లాడుతున్నావు. అందువల్ల ఇప్పుడు ఎలా; ఏం చెయ్యాలో అది కూడా నువ్వే చెప్పు'' మనస్ఫూర్తిగా అన్నాను.

మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం! మౌనం మార్గాన్ని అన్వేషిస్తోంది!

''తప్పదు. విశాల కోరికకు ఏదో బలమైన కారణం వుండే వుంటుంది. అది ఏమిటో అనుకుంటూ కూర్చోవటం అవివేకం. ఆమె ఇష్టాన్ని మనం కాదనకూడదు.

ఎంతో నిశితంగా ఆలోచిస్తోంది. ఆ ఆలోచనలో పట్టుదల!

ఉదయం పదకొండు గంటలు. భోజనం టైము. మా ఆవిడ వంటింట్లో ఏదో పనిలో వుంది. పిలుపుకోసం చూస్తున్నాను.

కాలక్షేపం కోసం పేపరు చదువుతున్నాను

వీధిగేటు చప్పుడవటంతో ఎవరోనని చూశాను. మా పనిమనిషి పైడితల్లి. చూడగానే జ్ఞాపకమొచ్చింది. గత నాలుగురోజులుగా పనిలోకి రాలేదు. పైగా తీరుబడిగా ఇప్పుడొస్తోంది!

ఈ పనిమనుషుల తీరే ఇంత. ఏదో ఒక వంకతో నెలలో నాలుగైదు రోజులు పనిలోకి రారు. రానిరోజుల్లో జీతం మినహాయింపుకి ఎంతమాత్రం ఒప్పుకోరు. పైగా 'మేమూ మనుషులమే! మాకూ సెలవు కావాలి' అంటూ ఎదురుతిరిగి మరీ తగవు పెట్టుకుంటారు. ఆలస్యంగా వస్తున్నావేమని అంటే మిగతా ఇళ్లల్లో కూడా పని చేసి వస్తున్నామని తెగేసి మరీ చెప్పటం.

పెరట్లోకెళ్లి నూతిదగ్గర కూర్చుంది మా పనిమనిషి.

''ఇదిగో పైడితల్లీ, అంట్లు తోమటం, ఇల్లు ఊడవటం నేనే చేసుకున్నాను. బట్టలు మాత్రం ఉతికిపెట్టు'' మా ఆవిడ మాటలు.



ఎంతో ఓపికగా మాట్లాడుతోంది. నాకు ఆశ్చర్య మేసింది.

"అదేంటమ్మగారూ, మీరుకూడా ఇట్టాగే సేసుకున్నారు. విశాలమ్మగారు కూడా నాకోసం ఏ పని మిగలకుండా అన్నీ అమ్మగారే చేసుకున్నేరు. ఇలా గయితే నాకు బాధగా వుందండీ" పైడితల్లి విశాల గారింట్లోనూ, మా ఇంట్లోనూ కూడా పనిచేస్తుంది.

"ఒసే పిచ్చిమొహమా, ఎందుకే బాధపడటం? నువ్వు మాత్రం ఇంట్లో ఊరికే కూర్చున్నావా? ఏవో పనులున్నాయని ఊరెళ్లావుగా" మా ఆవిడ మాటల్లో అనుకోని సానుభూతి!

ఈసారి మరింత ఆశ్చర్యం నాలో చోటు చేసుకుంది.

"ఒసేయ్ పైడితల్లీ! విశాలమ్మగారు ఎలా వున్నారు? ఏమిటి విషయం?" వసుధ ఆ మాట అడగటంతో " ఏం సెప్పమంటారమ్మగారూ! ఆ తల్లి మనసులో పిల్లల గురించి ఒకటే బెంగపెట్టేసుకున్నారండీ" మాటల్లో ఆవిడ మీదున్న అభిమానం వ్యక్తం చేస్తూ కళ్లు ఒత్తుకుంటోంది పనిమనిషి!

ఒకరింటి విషయాలు మరొకరింట్లో చెప్పకుండా వుండలేరు ఈ పనిమనుషులు. ఎక్కడెక్కడి విషయాలూ వీళ్లకే కావాలి. తెలిసిన సంగతులు మరొకరితో చెప్పకుండా వుండలేరు. ఒక్కొక్కసారి ఇంటిగుట్టు వీధిన పడటం వీళ్లవల్లే.

పైడితల్లి మాటలు వింటూ 'పనిమనుషుల స్వభావం ఎప్పటికీ మారదు' అనుకోకుండా వుండలేకపోతున్నాను.

'అదిసరే లేవే! ఇంతకీ నువ్వెళ్లిన పని పూర్తయిందా?" మా ఆవిడ వైఖరి నాలో చికాకు కలిగిస్తోంది. అయినా ఎంతో ఓపికతో సహిస్తున్నాను.

మా ఆవిడని చూశాను. మరో ధ్యాసలేకుండా తీరుబడిగా మాట్లాడుతోంది.

పల్లెటూళ్లలో జీవితం మనిషికి మరో మనిషికి మధ్య అనుబంధంతో వుంటుంది. ఎవరింట్లో ఏం జరిగినా, జరగబోతున్నా, ఊళ్లో వాళ్లకి తెలిసిపోతుంది.

విశాలమ్మగారింట్లో గత రెండు మూడురోజుల నుండి ఒకటే హడావిడి. ఇంటికి కొత్తగా సున్నం వేశారు. ఇంటి ఆవరణలో వెనకా ముందూ కూడా చెత్తాచెదారం తీసేసి శుభ్రంచేసి కొత్తకొత్త మొక్కలను పెట్టారు.

గేటుకి ఇవతలా లోపలా రంగురంగుల ముగ్గులు. గుమ్మాలకు ఇంటి తలుపులకు చక్కటి రంగులు.

పొలంలో పండించిన కూరగాయలు తీసుకొచ్చే వాళ్లు మా వూళ్లో దొరకని వస్తువులు, అలంకరణ సామగ్రి పట్నం నుంచి తెచ్చేవాళ్లు.

విశాలమ్మగారింట్లో ఏ పండగో, పేరంటమో తెలీదుకానీ, వాళ్ల ఇల్లు ఏదో హడావిడిని సంతరించుకుని కళకళలాడిపోతోంది.

ఊళ్లోవాళ్లు ఎవరికి తోచినట్టుగా వారు ఒక విశేషంగా చెప్పుకుంటున్నారు. నిజం చెప్పొద్దూ, చూస్తున్న నాకు కూడా ఆశ్చర్యంగానే వుంది.

ఇన్ని సంవత్సరాలుగా ఎంతో నిశ్శబ్దంగా వున్న విశాలమ్మగారిల్లు, హఠాత్తుగా ఎక్కడలేని సందడిని పుంజుకుంది.

కారణం ఏమిటో ఊహించటానికి ప్రయత్నించాను. వీలు కావటంలేదు. ఎందుకొచ్చిన ప్రయాస, మా ఆవిడని అడిగితే సంగతేమిటో తెలిసి పోతుంది.

సాయంత్రం వేళ ఆకాశంలో చంద్రుడు వెన్నెలతో ముస్తాబవుతున్నాడు.

భోజనం చేసి మా ఇంటి వాకిట్లో మడత మంచం మీద కూచున్నాను. ఈలోగా మా అర్ధాంగి లోపలినుంచి వచ్చింది. "ఏవండోయ్, మర చెంబులో మంచినీళ్లు పోశాను. గ్లాసుతో సహా మీ మంచంపక్కనే పెడుతున్నాను" అనగానే "ఏమిటో ఈ వేళప్పుడు బయలుదేరావు ఎక్కడికేమిటి?" యథాలాపంగా అడిగాను.

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

"మరేంలేదు, విశాల రమ్మని పిలిచింది. ఏవో పనులున్నాయని నన్ను ఒక చెయ్యివెయ్యమంటేనూ, పనులన్నీ తెముల్చుకుని వెడుతున్నాను" మా ఆవిడ వెళ్లే హడావిడిలో వుంది.

"ఒక్క క్షణం, అవును వసుధా, వాళ్లింట్లో ఈ మధ్య ఒకటే హడావిడిగా వుంటోంది. ఏదైనా శుభకార్యమేమైనా జరగబోతోందా?" అని అడిగాను.

నాకు జవాబు చెప్పటానికి ఆగింది మా ఆవిడ.


"శుభకార్యమే. కాని మామూలు శుభకార్యం కాదు. మన ఊళ్లో ఇప్పటివరకూ ఎవరింట్లోనూ జరగని శుభకార్యం చేద్దామనుకుంటోంది విశాల. చెప్పటానికి ప్రస్తుతం టైమ్‌లేదు. తీరుబడిగా మీకు తరువాత చెపుతాను. నేను రావటం ఆలస్యం కావొచ్చు. తలుపులు దగ్గిర వేసి వెడుతున్నాను. మీరు పడుకోండి" అని వెళ్లిపోయింది మా అర్ధాంగి.

ఏమిటో అంతటి శుభకార్యం? ఆశ్చర్యపోతోంది మనసు.

ఒకటి మాత్రం నిజం. విశాలమ్మగారింట్లో హడావిడి ఏ రోజుకారోజు పెరుగుతోంది. ఇలా అనుకోవటానికి కారణం వసుధ మధ్యాహ్నం కూడా ఆవిడింటికి సహాయపడటానికి వెడుతోంది.

అందరిలోనూ ఏదో తొందర. జరగబోయే శుభకార్యానికి అనుకున్న ముహూర్తం తరుముకొస్తున్నట్లు.

ఆ రోజు ప్రొద్దుటే పనిమీద బయలుదేరబోతున్నాను. మా ఆవిడ వసుధ "పనులన్నీ పూర్తిచేసు



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

కుని మధ్యాహ్నం కాస్త త్వరగా రండి'' అని చెప్పటంతో ''ఎందుకు మరీ అంత ప్రత్యేకంగా చెపుతున్నావు? అడిగాను.

మరీ అవసరముంటే తప్ప మా ఆవిడ అలా చెప్పదు.

''మన విశాల ఇవాళ మనింటికి వస్తోందండీ అందుకనీ వీలయినంత త్వరగా రండి'' మా ఆవిడ మాటలకు నాలో అనుకోకుండా కుతూహలం.

మధ్యాహ్నం ఒంటిగంట. కాస్తముందే వచ్చి భోజనం పూర్తిచేసి వరండాలో పేపరు చూస్తున్నాను.

ఇంటిముందు రిక్షా ఆగింది. విశాలమ్మ దిగుతోంది.

అది చూసిన మా ఆవిడ వసుధ ఎదురెళ్లి ఆవిడ చెయ్యి పట్టుకుని మరీ లోపలకి తీసుకొస్తోంది. సభ్యతకోసం కూర్చున్న వాడిని నేనుకూడా లేచి నిలబడ్డాను.

''బావున్నారా అన్నయ్యగారూ'' అంటూ నన్ను పలకరించి వసుధతో కలిసి లోపలకి వెళ్లింది. కాస్సేపు స్నేహితురాళ్లిద్దరూ అవి ఇవి మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

వసుధ లోపల నుంచి వచ్చింది. ''ఒక్కసారి లోపలకు రండి'' అంటూ పిలిచింది. నేను కూడా లోపలకి వెళ్లాను.

''అన్నయ్యగారూ వచ్చే ఆదివారం మీరూ వసుధ మా ఇంటికి రావాలి. పొద్దుట, సాయంత్రం భోజనాలు మా ఇంట్లోనే'' విశాలమ్మగారు ఎంతో ఆదరంగా ఆహ్వానించింది. ''ఏంటమ్మా విశేషం?'' మనసులో ఆసక్తిని వ్యక్తం చేశాను.

అలా అడగగానే ఆవిడ నిండుగా నవ్వింది.

''అవును అన్నయ్యగారూ విశేషమే. మాటల్లో చెప్పటం నా వల్ల కావటం లేదు. అందులోనూ ఇన్నాళ్లకు నేను అనుకున్నది జరగబోతోంది. ఆ రోజు మీరిద్దరూ మా ఇంటికి తప్పకుండా రండి. చూస్తే మీకూ సంతోషంగా వుంటుంది. నాకు కూడా ఎంతో తృప్తిగా వుంటుంది'' విశాలమ్మగారి మాటల్లో ఎందుకో ఉద్విగ్నత!


''ఈ మాట చెప్పటానికి శ్రమ తీసుకుని మీరు రావాలా? వసుధతో కబురు పెడితే చాలు'' మొహమాటంగా మాట్లాడాను.

''ఎంతమాట! అన్నయ్యగారూ ఇందులో శ్రమ ఏముంది? ఇది నా బాధ్యత. అయిన వాళ్లందరినీ నేనే స్వయంగా పిలవాలనుకుంటున్నాను. మరోసారి చెపుతున్నాను. మీ దంపతులిద్దరూ తప్పకుండారావాలి'' అంటూ వసుధని చూసింది. తప్పకుండా వస్తామని స్నేహితురాలికి హామీ ఇచ్చింది.

విశాలమ్మగారి మాటల్లో, మనసులో ఉత్సాహం! ఏదో ప్రత్యేకమైన విషయం తప్పకుండా వుండే వుంటుంది. ఊహించటానికి ప్రయత్నిస్తున్నాను.

ఆదివారం ఉదయం. విశాలమ్మగారి గేటుకి మామిడితోరణాలు. వసారాలో అరుగుమీద కుర్చీలలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంటి ఆవరణలో అటూ ఇటూ పరుగెత్తుతూ ఆటలాడుకుంటున్న పిల్లలు.

ఈ ఆదివారం ఒక అనుభూతి తప్పకుండా మిగిలిపోతుంది. అక్కడి వాతావరణంలో వెల్లివిరుస్తున్న ఉత్సాహానికి మనసులో కలుగుతున్న స్పందన.




మమ్మల్ని చూడగానే విశాలమ్మగారు మాకెదురొచ్చి వసుధ చెయ్యిపట్టుకుంది. ఆవిడలో చెప్పలేనంత సంతోషం!

''ఒరేయ్ అబ్బాయిలు'' అన్న విశాలమ్మగారి పిలుపు విని అరుగుమీద కూర్చున్న వాళ్లల్లో ఇద్దరు మాదగ్గరకొచ్చారు. వీరెవరో గుర్తుపట్టారా? మన మాధవయ్యగారు. నాన్నగారికి ఆప్తమిత్రులు. మనకెంతో కావలసిన వారు'' అని పరిచయం చెయ్యగానే వాళ్లునాకు నమస్కరించారు. వాళ్లని చిన్నప్పుడు చూశాను. పెద్దవాళ్లయ్యాక ఇప్పుడే కలవటం... ''అన్నయ్యగారూ అతను మా అల్లుడు శ్రీరామ్'' అంటూ మరొకతన్ని ప్రత్యేకంగా పరిచయం చేసింది.

ఒకరినొకరం పలకరించుకుని కబుర్లు చెప్పకుంటున్నాం. విశాలమ్మగారి కొడుకులు, అల్లుడు మంచి హోదాలో వున్నారని మాటల్లో అర్థమైంది.

ఇంతలో లోపలినుంచి టిఫిన్లు తీసుకొచ్చిన వాళ్లని చూసి ''ఇది మా అమ్మాయి. ఆ పక్కనున్నది వాళ్లమ్మాయి సాత్విక'' అమ్మాయి శ్రీలక్ష్మి టిఫిన్లు, కాఫీలు అందరికీ ఇవ్వు'' అన్న తల్లిమాటకు ''నువ్వేమీ కంగారుపడకు అన్ని విషయాలూ నేను చూసుకుంటాలే'' అని జవాబిచ్చింది.

''అరేయ్ అబ్బాయిలూ, ఇడ్లీలో కారప్పొడి, నెయ్యి వేసుకుని తినటం మీకిష్టమని స్వయంగా నేనే చేశాను'' విశాలమ్మగారి మాటల్లో వాళ్ల చిన్నతనపు జ్ఞాపకాలు!

''రొటీన్ లైఫ్‌లో హడావిడిగా బతుకుతున్న మాకు ఇలా పల్లెటూరికి రావటం ఎంతో హాయిగా వుంది'' టిఫిన్ తింటూ విశాలమ్మగారి అల్లుడు మాట్లాడాడు.

అతని మాట వినగానే విశాలమ్మగారి మొహం వెలిగిపోయింది.

''ఒకటి రెండు రోజులు బాగానే వుంటుంది బావగారూ, అటుతరువాత ఈ పల్లెటూరిలో వుండటం కష్టం'' పెద్దకొడుకు మాటలకు విశాలమ్మగారిలో పైకి కనిపించని బాధ!

ఎవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడుకుంటున్నారు. అదే క్షణంలో నాలో ఆలోచన! ఈ సందడి, సంతోషం కోసం విశాలమ్మగారు ఎంతో తాపత్రయపడింది.

అందుకు ఎన్నో ప్రయత్నాలు చేసి చివరికి తన పట్టుదలతో సాధించింది.

ఒక తల్లిగా ఆవిడ అనుకున్నది ఖచ్చితంగా సాధించింది. విశాలమ్మగారిని మనసారా అభినందించాను. మరుక్షణంలో నాలో మరో ఆలోచన. ఈ విషయంలో తనకు సహాయపడమని నన్ను అడిగితే ఇది అంత తేలికగా జరిగేది కాదని అన్న విషయం అన్న విషయం గుర్తుకొచ్చి మనసు చివుక్కుమంది.

ఒక కన్నతల్లి వృద్ధాప్యంలో ఎంతో ఓపికగా తన కోరికను నెరవేర్చుకుంది. ఎలా? ఎవరి ఆసరాతో తన ఆశను తీర్చుకుంది? నా ఊహకందని ప్రశ్న.

ఈరోజు ఈ ఇల్లు ఒక కొత్తదనంతో ముస్తాబయింది. విశాలమ్మగారు తన వయసుని మరచిపోయి హుషారుగా ప్రవర్తిస్తున్నారు. ఈ ప్రదర్శనకు కారణం ఆవిడలో ఏదో ఆలోచన. అదేమిటో?

మధ్యాహ్నం ఒంటిగంట. భోజనాలు పూర్తయ్యాయి. విశాలమ్మగారి పిల్లల పెళ్లి భోజనాలు కూడా రుచిగా ఉన్నాయో లేదో తెలియదు. కాని ఇవ్వాళ ఆత్మీయులందరికి ఆవిడ పెట్టిన భోజనం ఎంత రుచిగా వుందో మాటల్లో చెప్పడం కష్టం. ముఖ్యంగా ఆవిడ తన పిల్లలకు ఏమేమి ఇష్టమో అవన్నీ వండించి స్వయంగా అడిగి మరీ తినిపించింది.

భోజనం కడుపునింపింది. ఆప్యాయత మనసు నింపింది.

కాస్సేపయ్యాక అందరూ కబుర్లు చెప్పు కుంటూ హాలులో కూర్చున్నారు. మరికాస్సేపటికి విశాలమ్మగారు కూడా అక్కడికొచ్చారు.

''మీరందరూ శ్రమనుకోకుండా నాతో రావాలి'' అంటూ విశాలమ్మగారు కొడుకులను, కోడళ్లను, కూతురితోపాటు అల్లుడిని పిలిచారు'' కారణం ఏమిటని అడగకుండానే వాళ్లందరూ ఆవిడతో బయలుదేరారు.

అప్రయత్నంగా మనసు ప్రోత్సహిస్తుంటే నేను కూడా వెళ్లాను. వసుధ చెయ్యిపట్టుకుని ఆ ఇంట్లో గదులలోకి వెళుతోంది.

''ఇది మా పెద్దబ్బాయి చిన్నప్పటినుండి ప్రత్యే కంగా తనకోసం వుంచుకొన్నాడు. ఇంట్లో వున్నంత సేపూ వాడు ఈ గదిలోనే వుండేవాడు. ఒక విధంగా చెప్పాలంటే ఒక్క భోజనానికి మాత్రమే బయటికొచ్చేవాడు. చదువుకోవటం, పడుకోవటం అన్నీ వాడికి ఇక్కడే. మరో విషయమేమిటంటే వాడికి పక్కమీద దుప్పటి నలగకూడదు. వాడి వస్తువులన్నీ ఎక్కడివక్కడే వుండాలి! నాకు తెలిసినంతవరకూ ఇప్పటికీ వాడి స్వభావమదే! అందుకనే ఇవ్వాళకూడా వాడికోసం ఈ గదిని శుభ్రం చేయించాను. ఏరా అబ్బాయి నీకు నచ్చిందా?'' అని అడిగింది.

గది చక్కగా తీర్చిదిద్దినట్లుగా వుంది. కొత్త దుప్పటితో పక్క ఎంతో నీట్‌గా వుంది.

''ఇటురండి. ఇది మా చిన్నవాడి గది. వీడు చిన్నప్పటినుంచి తన పనులు ఇంకొకరి చేత చేయించుకునే వాడు! పొద్దున లేచిన తరువాత కప్పుకున్న దుప్పటి ని నేను మడత పెట్టాల్సి వచ్చేది. రాత్రిపూట చదువు కుంటూ అలాగే నిద్రపోయేవాడు. అవన్నీ సర్దిపెట్టటం కూడా నా వంతే! ఒక్కడూ వుండటానికి భయం. అందుకోసమే వాడి చదువు పూర్తయ్యేవరకూ నేను కూడా ఈ గదిలోనే పడుకునేదాన్ని. మా చిన్నాడు అమ్మచాటు పిల్లాడు'' విశాలమ్మగారి మాటలకు కోడళ్లిద్దరూ తమ భర్తలను చూసి నవ్వుకుంటున్నారు.

'ఇకపోతే ఇది మా అమ్మాయి గది. చిన్నప్పటి నుండి బొమ్మలు వేయటం నేర్చుకుంది. దీనికి అలంకారాలంటే ఎంతో మోజు. ఈ గదిలో గోడల కున్న పెయింటింగులన్నీ ఇది వేసినవే!'' గదిలో గోడలకు అటూటూ రకరకాల పెయింటింగులు! ఇక సెలవురోజుల్లో తను నేర్చుకున్న కుట్లు, అల్లికలతో నేను మా అమ్మాయి ఈ గదిలోనే కూర్చునే వాళ్లం. కొన్ని కుట్టుపనులు, అల్లికలు నేను కూడా మా అమ్మాయిదగ్గరే నేర్చుకున్నాను'' అంటూ అల్లుడి కేసి చూపిస్తూ నవ్వారు. అతను చిలిపిగా వాళ్లావిడని చూస్తున్నాడు.

''మీరొస్తున్నారని మీ గదులన్నీ మీకోసం మీకు నచ్చినట్టుగా నేను, మన వసుధ కలిసి రెడీ చేశాం'' గత వారం రోజులుగా వసుధ వీళ్లింట్లోనే ఎక్కువ గడిపిన విషయం అప్పుడర్థమయ్యింది. మళ్లీ అందరం కలసి హాలులోకొచ్చాం.

ఒక్కొక్క జ్ఞాపకం ఎన్నెన్నో చందమామలు. ఆ వెన్నెలలో విశాలమ్మగారి మొహం తళతళా మెరిసిపోతోంది!

మా చుట్టూ నిశ్శబ్దం! విశాలమ్మగారి చూపుల్లో నిశ్శబ్దం లేదు. ఎన్నో విషయాలు... మరెన్నో మాటలు చెప్పాలని ఆవిడ మనసులోని ఆరాటం.. ఆ కళ్లల్లో కదులుతూ వుంది.

''ఈ ఇంట్లో మీ బాల్యం ఎంత సందడిగా గడిచిందో చెప్పాను. మీరంతా పెరిగి పెద్దవాళ్లయి ఎవరి జీవితంలో వాళ్లు స్థిరపడ్డారు. ఒకవైపు నాకెంతో సంతోషం కలుగుతోంది. మరోవైపు దిగులు పెరుగుతోంది.

విశాలమ్మగారు ఒక ముఖ్యమైన విషయం ఎవరికీ తెలియనిదేదో చెప్పాలని మాటలు వెతుక్కుంటున్నారు. ఎంతో ఆత్రుతతో నా మనసు ఎదురు చూస్తోంది.




''మీరున్నప్పుడు ఎంతోకళకళలాడుతూ వున్న మనిల్లు ప్రస్తుతం స్తబ్దుగా వుంది. నాచుట్టూ వున్న నిశ్శబ్దం, నా జీవితంలోని శూన్యం నేను భరించలేక పోతున్నాను. ఇదీ ప్రస్తుతం నా జీవితం. కాని మీకు ఎన్నో వ్యాపకాలు... మరెన్నో తాపత్రయాలు. కాలంతో పోటీపడి మరీ కాలం వెనక్కు పరుగెత్తుతున్నారు. పరుగు బతుకులో బంధాలు, అనుబంధాలు తాలూకు ఆలోచనలు మీకు రావు! ఇది నా ఉద్దేశం మాత్రమే.

అందుకే నేను మీకు ఇవ్వవలసినది పూర్తిగా ఇవ్వలేదనే వెలితి నన్ను అనుక్షణం వెంటాడుతోంది!''

మా అందరిలోనూ ఏదో అయోమయం.

'నాలోని బాధను నా స్నేహితురాలు వసుధతో చెప్పాను. మనందరం మళ్లీ మళ్లీ కలుసుకోవటానికి చక్కటి సందర్భం గురించి చెప్పింది. చదువుకోకపోవటంతో వసుధ చెప్పేవరకూ నాకు తెలియదు!''

ఈ మాటలంటూ ఆవిడ చూపులు వసుధ మనసును ఆప్యాయంగా స్పర్శిస్తున్నాయి. పమిట కొంగుతో వసుధ కళ్లొత్తుకుంటోంది.

''వసుధ వల్ల నాలోకలిగిన ఆలోచన మీతో చెప్పాలనే తపన! కాని నా ఆలోచనకు అక్షరాలు లేవు! అందుకే నా అంతరాత్మను తోడిచ్చి పైడితల్లిని మీ దగ్గరకు పంపించాను.

నేను అనుకున్న రోజుకే మీరందరూ నాకోసం మనింటికి వచ్చారు. మనందరం సంతోషంగా కలుసుకున్న ఈ రోజు మనకందరికీ ఎంతో అపురూపమైన రోజు!

ఈ రోజు 'మదర్స్‌డే' ఈ రోజు మిమ్మల్నందరినీ ఇలా కలుసుకోవాలన్నదే నా కోరిక. ఈ సందర్భంలో మీతో చెప్పవలసిన మాటని ఇన్నాళ్లూ నా ప్రపంచంలో పదిలంగా దాచుకున్నాను. ఎంతో తృప్తిని వ్యక్తం చేస్తూ మాట్లాడుతోందావిడ.

విశాలమ్మగారి మాటలు ప్రతి ఒక్కరి మనసులోనూ ఆలోచనలు తట్టిలేపుతున్నాయి. ''నేను పోగొట్టుకున్నది కనీసం మీరైనా పదిల పరచుకోవాలన్నదే నా ఆశ. వృద్ధాప్యం ఎవరికీ తప్పదు. అంతే కాదు వృద్ధాప్యం ఒక కన్నీటి చుక్కగా మిగిలిపోకూడదు. సంవత్సరానికి ఒకసారే వచ్చే ఈ రోజున మీరు మీ పిల్లలతో ఆనందంగా గడపండి. ఒకరంటే ఒకరికి మమకారం పెంచుకోండి. మమతలను పంచి మీ మనసుకి చక్కటి అనుభూతినివ్వండి. అప్పుడే మీ వృద్ధాప్యం వెన్నెల తునకగా నిలిచిపోతుంది.

మా చుట్టూ వున్న వాతావరణం అనిర్వచనీయమైన ఆత్మీయతను నిండుగా సంతరించుకున్న క్షణం...

నిజానికి విశాలమ్మగారు చదువుకోలేదుగానీ జీవితాన్ని అర్థం చేసుకున్న కన్నతల్లి. కన్నతల్లిగా ఆ అర్థాన్ని తన వాళ్లందరికీ పంచివ్వగలిగింది. ఈ క్షణాలు మరిచిపోలేనివి.

ఒక మాతృమూర్తి తన మనసును వెలిగించుకున్న క్షణం!

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत · उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future